# సరదా కథలు

## కొండగుర్తు

రాంబాబు కూతురికి పెళ్ళవుతోంది. నిజానికి అదో పెద్ద విశేషమేం కాదు. ఎందుకంటే ఎందరికో జరిగినట్టే అది కూడా పెద్దలు కుదిర్చిన సాదాసీదా పెళ్ళి. ఆ పెళ్ళికి కొంతమంది వీవీ ప్రముఖులు హాజరవుతున్నారు. ఖచ్చితంగా చెప్పాలంటే అది కూడా ఓ విశేషం కాదు. రాంబాబుతో వారికున్న స్నేహసంబంధాలను బట్టి చూస్తే అది ఓ మామూలు సంఘటన కిందే లెక్క. మరీ ఉపోద్ఘాతం అంతా ఎందుకంటే ఆ పెళ్ళికి రాంబాబు బాస్ అటెండ అవుతున్నాడు. అదీ విశేషం కమ్ ప్రాబ్లెమ్.

ఇక్కడ రాంబాబు గురించి, అతని బాస్ గురించి ఓ రెండు ముక్కలు చెప్పాలి.

రాంబాబు ఓ చిన్న ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. వృత్తిరీత్యా జీతం రాళ్ళకోసం పనిచేస్తున్నా, ప్రవృత్తి రీత్యా అతడొక కథకుడు, విమర్శకుడు. అంచేత వివిధ పత్రికలకి కథలు, విమర్శలు రాయటం హాబీగా పెట్టుకున్నాడు. అతడి రచనల్లో సహజంగా ఉండే స్పార్క్ వల్ల అతి తక్కువ కాలంలోనే ఎంతోమంది ప్రముఖుల దృష్టిలో పడి వారి అభిమానాన్ని, స్నేహాన్ని పొందగలిగాడు. అంచేత ఆ ప్రముఖులందరూ రాంబాబు ఇంటికి వస్తూ పోతూ ఉండటం సర్వసాధారణం అయిపోయింది.

చాలామంది అతడి కథలు చదివి, ఈ పరిచయాలు చూసి 'ఫీల్డుకి వెళ్ళిపోరాదూ' అని సలహా ఇచ్చేవారు. నవ్వేసి ఊరుకునేవాడు రాంబాబు. కారణం సినీపరిశ్రమలో ఉండవలసిన మొట్టమొదటి టాలెంట్, లౌక్యం తనలో లేదన్న విషయం అతనికి ఖచ్చితంగా తెలుసు. ఏ టెన్షన్లూ లేకుండా నెలకింత అంటూ వస్తే అదే పదివేలు అని తృప్తి పడేవాడు. సాయంత్రం ఆఫీసు అయిపోయాక తన మనసుకి తృప్తినిచ్చే రచనలు మాత్రమే సాగించేవాడు.

ఇక రాంబాబు బాస్ గురించి... ఆయన పేరేమిటో చెప్పటం కన్నా రాంబాబు బాస్ అని వ్యవహరించడమే మంచిది. ఎందుకంటే బైటి ప్రపంచానికి అతడెలా ఉంటాడో తెలీకపోయినా, అతడి పేరేమిటో అంతకన్నా తెలీకపోయినా, రాంబాబుకున్న పేరు బట్టే అతణ్ణి 'రాంబాబు బాస్' అనే చెప్పుకుంటూ ఉంటారు. ఆయన గురించి ఏదైనా టాపిక్ వస్తే! దానికి్కారణం ఆయన బైటి ప్రపంచానికి తెలియకపోవటంమే కాదు. ఆయనక్కూడ బైట ప్రపంచం ఎలా ఉంటుందో తెలీకపోవటమే! ఎంతసేపూ ఇల్లూ, ఆఫీసూ... అంతే!

"అంత పెద్ద ఆఫీసు నడుపుతూ ఇంతమంది స్టాఫ్‌ని మెయిన్‌టెయిన్ చేస్తూ బొత్తిగా బైట ప్రపంచమే తెలీదా" అని నోళ్ళు నొక్కుకోవచ్చు. పైగా ఆయన నూటికి నూరు పయిసల తెలుగువాడు కూడా.

ఇది విన్న తర్వాత మరింత ఆశ్చర్యం కలగొచ్చు. ఎందుకంటే మన తెలుగు వాళ్ళకి ఆఫీసు వ్యవహారాల కన్నా బైటి వ్యవహారాల మీద ఏకాగ్రత ఎక్కువ కనుక, అటువంటిది తెలుగువాడై పుట్టి ఆఫీసు తప్ప ఇంకో ప్రపంచం తెలీని ప్రాణి ఎలా ఉంటుందోనన్న కుతూహలం రాంబాబు బంధువుల్లోనూ స్నేహితుల్లోనూ తెగ గాఢంగా నాటుకుపోయింది.

"నీకెందుకు గురూ... నువ్వు పీటల మీద కూచుని కన్యాదానం, పనులు అవీ చూసుకో మేం నీ బాస్‌ని గౌరవంగా లోపలికి తీసుకొస్తాం కదా!" అని మాట ఇచ్చారు అతని స్నేహితులు.

ఇదీ అసలు కథకి ఉపోద్ఘాతం... ఇప్పుడు అసలు కథ మొదలు...

సరే... పెళ్ళవుతోంది. వచ్చేవాళ్ళలో చాలామంది ప్రముఖులు ఉన్నారు గనుక గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. గేటు దగ్గిర ఇన్విటేషన్ లేనిదే ఎట్టి పరిస్థితుల్లోనూ లోనికి రానివ్వని కరోడాల్లాంటి పోలీసులు కాపలా ఉన్నారు. కాకపోతే వచ్చే ప్రముఖుల్లో ఇన్విటేషన్ ఎవరైనా మర్చిపోతే వాళ్ళని గనుక ఈ పోలీసులు గుర్తుపడితే వ్యక్తిగత పూచీమీద లోపలికి వదలొచ్చు. అదీ అక్కడ అరేంజ్‌మెంట్.

నిజానికి పెళ్ళి సాదాసీదాదే అయినా వచ్చిన ప్రముఖులతో ప్రత్యేకమైన కళ సంతరించుకుంది. ఆ సమయంలో వచ్చి ఆగింది ఓ కారు. అందులోంచి దిగాడు రాంబాబు బాస్.


'మన రాంబాబే కదా...' అని ఆయన ఇన్విటేషన్ తీసుకురాలేదు. రూలు ప్రకారం గేటు దగ్గిర పోలీసులు అడ్డేశారు.

"నేను రాంబాబు బాస్‌నయ్యా" అన్నాడాయన.

"అయితే మాకేంటి?" అన్నారు వాళ్ళు.

"మాకేంటి అంటే ఎలా... నేను లోపలికి వెళ్ళితీరాలి."

"మీరు రాంబాబు గారి బాస్ అని ప్రూవ్



చేసుకోండి సార్ ఒదుల్తాం'' అన్నారు పోలీసులు.

''ప్రూఫ్ చేసుకోవాలా... అదెలా?'' అని సందిగ్ధంలోపడ్డాడాయన. పోనీ వెనక్కి వెళ్ళి ఇన్విటేషన్ పట్టుకొని వద్దామా అంటే అది ఏ ఫైల్‌లో పెట్టి మర్చిపోయాడో గుర్తు రావటం లేదాయనకి.

ఈ గొడవంతా చూస్తున్నారు రాంబాబు స్నేహితులు. వాళ్ళకి కూడా ఆయన రాంబాబు బాసే అయి ఉండొచ్చనిపిస్తోంది. కానీ ఎలా... హామీ ఇచ్చి లోపలికి పంపడానికి వాళ్ళకి కూడా జంకుగానే ఉంది.

ఈ లోగా పోలీసులు చెప్పడం మొదలు పెట్టారు.

''ఎలా అంటే ఏవుంది సార్... మీలాగే ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గారు కూడా ఇన్విటేషన్ మరిచిపోయారు. 'మీరు బాలు గారని ఏంటి ఋజువు సార్' అన్నాం. పాపం ఆయన ఏమీ అనుకోకుండా ఓ పాట పాడివినిపించారు. వెంటనే పోల్చేసుకున్నాం. లోపలికి పంపించాం. అలాగే జంధ్యాల గారు వచ్చారు. ఆయన కూడా ఇన్విటేషన్ తీసుకురాలేదు. 'మీరు జంధ్యాల గారని ఏంటి ఋజువు' అని అడిగాం. ఆయన కూడా సరదాగా నవ్వేసి ఓ జోక్ చెప్పారు. అది తల్చుకుంటే ఇప్పటికీ నవ్వొస్తుంది. అంత చమత్కారంగా మాట్లాడేది జంధ్యాలగారే కదా. వెంటనే ఆయన్ని కూడా లోపలికి పంపించేసాం.

ఆ తర్వాత బాపూగారు వచ్చారు. ఆయనా ఇన్విటేషన్ తీసుకురాలేదు. ఆయన్ని కూడా అడిగాం. 'మీరు బాపూగారని ఏంటి ఋజువు' అని పక్కనున్న కాగితం పెన్ను తీసుకుని ఓ కార్టూన్ గీసి చూపించారు. ఆ స్ట్రోక్ చూడగానే చెప్పొచ్చు ఆయన బాపూగారని. వెం... ఒం... ఒం.. తనే లెంపలేసుకొని మరీ లోపలికి పంపించాంఆయన్ని.

అలా మీ దగ్గిర ఏదైనా ప్రూఫ్ ఉందా?'' అన్నారా పోలీసులు.

రాంబాబు బాస్‌కి ఓ క్షణం పాటు కళ్ళు తిరిగి నట్టయింది.

''ఎవరు... ఎవరు ఈ బాలసుబ్రహ్మణ్యం, ఈ జంధ్యాల, ఈ బాపు? ఎవరయ్యా... ఎవరు వీళ్ళంతా?'' అని అడిగాడు.

మిస్టరీ విడిపోయింది రాంబాబు స్నేహితులకి.

''కరెక్ట్ సార్... మీరు రాంబాబు బాస్... తెలుగువారై పుట్టి, ఆంధ్రదేశంలో ఉంటూ వీళ్ళంతా ఎవరో తెలీయదు అంటే మీరు ఖచ్చితంగా రాంబాబు బాసే... రండి సార్ లోపలికి రండి'' అంటూ పోలీసులతో తమ వ్యక్తిగత పూచీ మీద సకల మర్యాదలతో తీసుకువెళ్ళారాయన్ని. ●●

# అద్భుత ప్రపంచం

మానవ చరిత్రలో అతి పురాతన వృత్తులలో వ్యభిచారం ఒకటి చెపుతుంటారు. కానీ ఏ వృత్తికీ లేని ఆకర్షణ యీ వృత్తికి వుంది. ఆ ఆకర్షణ ఆధారంగా యీ వృత్తికి అనేకరకాల వ్యాపార రంగులు అదనంగా తోడయ్యాయి. వ్యభిచార వ్యాపారం గురించి గతంలో ఎన్నో రకాల సంగతులు విన్నాం. యీ మధ్యనే వెలుగులోకి వచ్చిన విషయాలు అద్భుత ఆశ్చర్యాలని కలుగచేస్తున్నాయి.

మనుగడకి మౌలికంగా అవసరమైన వాటిలో విద్య, ఆరోగ్యం ముఖ్యమైనవి. వీటి మీద ప్రపంచ వ్యాప్తంగా కోట్లకొద్దీ వ్యాపారం జరుగుతోంది. పైకి కనపడకపోయినా అంతకన్నా పెద్ద వ్యాపారం శ్రమ శక్తి (LABOUR). ఒక ప్రాంతం నుంచీ మరో ప్రాంతానికి కూలిపనుల కోసం శ్రామికులు వలస వెళ్ళటం మనకి తరచూ తారసపడుతూనే వుంటుంది. కొంచం లోతుగా పరికిస్తే యిదే వ్యవహారం ఉద్యోగాల పేరిట, ఎక్కువ ఆర్జన పేరిట అంతర్జాతీయ స్థాయిలో జరుగుతూండటం కనిపిస్తుంది.

మన దేశం నుంచి అమెరికా, యూరప్, అరబ్ దేశాలకి ఎందరో ఎన్నో రకాలుగా ఆర్జన కోసం వెళ్ళటం కొత్త విషయమేంకాదు.

కానీ మన దేశానికి యింకా అలవాటులేని ప్రక్రియ ఒకటి వుంది.

కొన్ని ధనిక దేశాలలో 'వినోదం' కూడా వ్యాపారమే. ఆ వ్యాపార కేంద్రాలలో ఉండే ఉద్యోగులని అక్కడ పనిచేసే వారిని వారు లేబర్ కిందే పరిగణిస్తారు. ఆ వినోద స్థలాలని వ్యాపార కేంద్రాలుగానే పరిగణించి, దానికి తగిన రూల్స్ ఏర్పరిచారు.

'ఎంటర్ టెయినర్స్' అని పిలువబడే యీ వృత్తి కోసం పలు పేద ఆసియా దేశాల నుంచి ప్రతిఏటా వేల సంఖ్యలో జనం, ఎక్కువ శాతం స్త్రీలు ధనిక దేశాలకి తరలి వెడుతున్నారు.

వృత్తిపరంగా 'ఎంటర్ టెయినర్' అన్న గుర్తింపు పత్రాలతో, కేవలం వినోద పర్యటన కోసం వచ్చినట్టు టూరిస్టు వీసాలతో వీళ్ళని ఒక దేశం నుంచి మరో దేశానికి తరలించే అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠాలు చాలా వున్నాయి. ఫిలిప్పీన్స్ నుంచి, థాయిలాండ్ నుంచి జపాన్ తదితర ధనిక దేశాలకి తరలివెళ్ళే వీళ్ళ సంఖ్య ప్రతిఏడూ పెరుగుతోంది. ఇలా వెళ్ళే వాళ్ళల్లో అధికశాతం పదహారు ముప్ఫయ్ ఏళ్ళ మధ్యలోని ఆడవాళ్ళే.

పొట్టకూటి కోసం ఆడైనా, మగైనా మరో చోటికి వెళ్ళి శ్రమించి నాలుగు డబ్బులు పోగుచేసుకోటంలో ఎవరికీ ఆక్షేపణ లేదు. కానీ ఈ 'ఎంటర్ టెయినర్స్' పరిస్థితి పరమదారుణం.

వీరి కంట్రాక్టులు, వీసాలు, గుర్తింపు పత్రాలు ఏమీ వీరిని చట్టరీత్యా ఆదుకోలేవు. వీరు ఎన్నో ఆశలతో పరాయి దేశంలో కాలు పెట్టగానే అక్కడి ముఠా వాళ్ళు వీళ్ళ పత్రాలని లాగేసుకుంటారు. ఆ తర్వాత వినోదం పేరిట వీరిని అన్ని రకాల వికృత చర్యలకి గురి చేస్తారు. డబ్బున్న వారి వింతధోరణులకి, పెర్వర్షన్స్‌కి వీరి పావులు.

## శృంగారహింస

అబలకు దుర్భరం అని దానికన్నా చావే నయమని ఎందరో స్త్రీలు ఎలుగెత్తి చెపుతున్నా ఈ ఎంటర్ టెయినర్స్ వ్యాపారం జరుగుతూనే వుంది.

ఆర్థికమైన బాధలు ఏ మనిషిని ఎటువంటి నైచ్యానికి దింపుతాయో చెప్పలేం. గల్ఫ్‌కి వెళ్ళి అగచాట్లు పడిన ఆడవాళ్ళ కథలు కోకొల్లలు. అయినా వెడుతూనే వున్నారు. ఫిలిప్పీన్స్ నుంచి జపాన్ వెళ్ళి దారుణమైన సెక్స్ హింసలకీ, హత్యలకి గురి అవుతున్న ఆడవాళ్ళు అనేకం. అయినా వెడుతూనే వున్నారు. ఇన్ని ఘోరాలు జరుగుతున్న ఎంటర్ టెయినర్స్ వ్యాపారం సజావుగా జరగటం, అమానుషం మనుషులగా చెలామణీలో వుండటం, అశ్రువులు దిగమింగుతూ అద్భుతమనే అనుకోవాలి. ఫిలిప్పీన్స్ నుంచి 1980లో పదిహేను వేల మంది ఎంటర్ టెయినర్స్ తరలివెడితే 1990కి వారి సంఖ్య 80,000కి పెరిగింది. అతి పురాతన వృత్తి వ్యభిచారం కన్నా దయనీయమైంది ఈ వ్యాపారం.

— రావు.